www.kalamjyothi.com
# కలంజ్యోతి
రేపటి కోసం
బుధవారం
12 మార్చి 2025

## విలేఖరులు కావలెను


కలంజ్యోతి తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తిస్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'కలంజ్యోతి' సాదర స్వాగతం పలుకుతోంది.
సెల్ : 9494 009 003

- నేటినుంచి అసెంబ్లీ సమావేశాలు
- సభలో 5 కీలక బిల్లులు.. 2 నివేదికలు..!
- తొలిరోజు సభ వాయిదా వేసే అవకాశం
- మూడు రోజుల పాటు ఎమ్మెల్యేలకు శిక్షణ
- సమావేశాలకు సిద్ధమైన అధికార విపక్షాలు
- ప్రభుత్వాన్ని నిలదీయాలని కేసీఆర్ పిలుపు

# అధ్యక్షా..

**కలంజ్యోతి, హైదరాబాద్ :** తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. సమావేశాల తొలిరోజు పలు కీలక బిల్లులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభలో ప్రవేశ పెట్టనున్నారు. మరోవైపు కాంగ్రెస్ ఏడాది పాలన విజయాలను వివరించేందుకు సిద్ధమవుతుంటే ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకు బీఆర్ఎస్ రెడీ అయ్యింది.

**5 కీలక బిల్లులతో పాటు.. 2 నివేదికలు..**

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు సోమవారం ఉదయం 10.30కు ప్రారంభం కానున్నాయి. తొలిరోజు 5 కీలక బిల్లులతో పాటు.. 2 నివేదికలను సభలో ప్రవేశ పెడతారు. తెలంగాణలో ఉద్యోగుల జీతాలు, పింఛన్ల చెల్లింపు, అనర్హతల తొలగింపు బిల్లు (సవరణ), తెలంగాణ పురపాలక సంఘాల సవరణ బిల్లు, హైదరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ అమెండ్‌మెంట్ బిల్లు, తెలంగాణ జీఎస్టీ సవరణ బిల్లు, తెలంగాణ పంచాయతీరాజ్ సవరణ బిల్లులు, 2022-23 సంవత్సరానికి గానూ ఎలక్ట్రిసిటీ ఫైనాన్స్ 9వ వార్షిక నివేదిక, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ లిమిటెడ్ 7వ వార్షిక నివేదికను సభ ముందు ప్రవేశపెడతారు.

2లో









# తులం బంగారం ఎక్కడా?

5లో

- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి
- నిర్మల్ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఏలేటి



## పోలీస్ కవాతు ఎస్పీ ప్రశంసలు

**కలంజ్యోతి, జగిత్యాల :** పోలీస్ కవాతు ఉత్సాహంగా నిర్వహించడంలో పోలీస్ బ్యాండ్ ప్రాముఖ్యత చాలా అవసరమని ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పోలీస్ బ్యాండ్ సిబ్బందికి ఎస్పీ స్పోర్ట్ డ్రెస్ ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ కవాతు ఉత్సాహంగా నిర్వహించడంలో బ్యాండ్ ప్రాముఖ్యత చాలా అవసరమన్నారు. పోలీసు శాఖలో పోలీస్ బ్యాండ్ ఎంతో ప్రాధాన్యత కలిగిన భాగంగా నిలుస్తుందన్నారు. ఇది కేవలం సంగీత బృందంగా కాకుండా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరిగే అధికారిక వేడుకలు అయన స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం, అమరవీరుల దినోత్సవం, పోలీసు పరేడ్‌లు, గౌరవ వందన కార్యక్రమాల్లో పోలీస్ బ్యాండ్ ప్రదర్శనలు ప్రధాన ఆకర్షణగా ఉంటాయన్నారు. ఈ మధ్యకాలంలో జరిగిన కార్యక్రమంలో పోలీస్ బ్యాండ్ పనితీరు ప్రశంసనీయంగా ఉందని ఇదే స్ఫూర్తితో రానున్న రోజుల్లో మరింత ఉత్సాహంగా విధులు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమం అదనపు ఎస్పీ బీమ్ రావు, రిజర్వ్ ఇన్ స్పెక్టర్ వేణు, బ్యాండ్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఎన్‌హెచ్‌ఆర్‌సీ వరంగల్ జిల్లా చైర్మన్‌గా గంగుల అశోక్



**కలంజ్యోతి, గీసుగొండ :** మానవ హక్కుల సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా 16వ డివిజన్ ధర్మారం గ్రామానికి చెందిన గంగుల అశోక్ ను నియమిస్తూ రాష్ట్ర చైర్మన్ బద్దిపడిగా శ్రీనివాస్ రెడ్డి నియామక పత్రాన్ని మంగళవారం అందజేశారు. తనపై నమ్మకంతో ఈ బాధ్యతలు ఇచ్చినందుకు రాష్ట్ర అధ్యక్షుడికి అశోక్ కృతజ్ఞతలు తెలిపారు. ఎన్ హెచ్‌ఆర్ సీ సంస్థలో తన కర్తవ్యాన్ని క్రమశిక్షణతో నెరవేస్తానని తెలిపారు. ఎల్లప్పుడూ రాష్ట్ర రాష్ట్ర, జిల్లా కమిటీ బాధ్యులకు, సభ్యులకు అన్ని విధాలుగా సహకారం అందజేస్తానన్నారు. మానవ హక్కుల చర్యలో పేద ప్రజల తరఫున చట్టపరమైన తోడ్పాటును అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఆపదలో ఉండే ఈ వ్యక్తికైనా ఎన్ హెచ్‌ఆర్ సీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు.

## ఆ మార్గదర్శకాలు పాటించండి

**కలంజ్యోతి, హైదరాబాద్:** ఇటీవల ఏపీ సర్కారు ఇచ్చిన మార్గదర్శకాల ప్రకారం తెలంగాణకు చెందిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు తిరుపతి దేవుడి దర్శనం కోసం ఇచ్చే సిఫారసు లేఖలను అనుమతించాలని మంత్రి కొండా సురేఖ కోరారు. ఈ మేరకు ఆమె ఏపీ సీఎం చంద్రబాబుకు లేఖ రాశారు. చంద్రబాబు నాయకత్వంలో తీసుకున్న ఈ మంచి నిర్ణయం తెలంగాణ ప్రజాప్రతినిధులందరికీ ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. తెలంగాణ నుండి తిరుమలను సందర్శించే భక్తుల సంఖ్య ఈ మధ్య బాగా పెరిగిందని, రాష్ట్రం విడిపోయిన తర్వాత కూడా, తెలుగు ప్రజల భక్తి.. ముఖ్యంగా తెలంగాణ ప్రజల భక్తి తిరుమల తిరుపతి వేంకటేశ్వరుడిపై తగ్గలేదని మంత్రి పేర్కొన్నారు. అయితే, టీటీడీ అధికారులు ఏపీ ముఖ్యమంత్రి ఆదేశాలను సరిగ్గా పట్టించుకోవడం లేదని నివేదించారు. దీంతో తెలంగాణ ప్రజాప్రతినిధులు, తిరుమల వేంకటేశ్వరుడి భక్తులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. టీటీడీ అధికారులు తెలంగాణ భక్తులను అనుమతించకపోవడంపై తీవ్ర గందరగోళం నెలకొందని తెలిపారు. ఈ విషయాన్ని వెంటనే ప్రత్యేకంగా పరిశీలించి, సదరు ఆదేశాలను సక్రమంగా పాటించేలా టీటీడీ అధికారులకు స్పష్టమైన సూచనలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.



# అధ్యక్షా..

## నేటినుంచి అసెంబ్లీ సమావేశాలు

**తొలిరోజు సభ వాయిదా?**

బిల్లుల్ని ప్రవేశపెట్టిన తర్వాత తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు, డిసెంబరు 9న తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై ప్రకటన తదితర అంశాలపై అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటన చేస్తారు. ఈ అంశంపై స్వల్ప కాలిక చర్చ చేపట్టే అవకాశాలు ఉన్నాయి. అనంతరం సంతాప తీర్మానాలు ప్రవేశ పెడతారు. సంతాప తీర్మానం తర్వాత తొలిరోజు సభ వాయిదా పడే అవకాశాలున్నాయి.

**ఎమ్మెల్యేలకు శిక్షణ కార్యక్రమం!**

అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లోనే రైతు భరోసా విది విధానాలపై చర్చిస్తారు. ఇప్పటికే రైతు భరోసాపై మంత్రి వర్గ ఉప సంఘం జిల్లాల్లో పర్యటించి.. రైతులు, రైతు సంఘాలు, కూలీలు తదితర వర్గాల నుంచి రైతులకు అందించాల్సిన సాయంపై అభిప్రాయాలు సేకరించింది. వాటిని క్రోడీకరించి.. నివేదిక కమిటీ సిద్ధం చేసింది. మంత్రి వర్గ ఉపసంఘం రూపొందించిన నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టి.. అన్ని పార్టీల ఎమ్మెల్యేల నుంచి సూచనలను ప్రభుత్వం స్వీకరించాలని భావిస్తోంది. తొలి రోజు సోమవారం సభ ముగిసిన తర్వాత కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలకు సభా కార్యక్రమాలపై శిక్షణ నిర్వహించాలని భావిస్తున్నారు. 23 రోజుల శిక్షణ అనంతరం తిరిగి సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి. బీఏసీలో చర్చించిన తర్వాత దీనిపై నిర్ణయం తీసుకోనున్నారు.


**సమావేశాలకు రెడీ అవుతున్న అధికార విపక్షాలు..**

శాసనసభ సమావేశాల్లో హైదరాబాద్‌కు సంబంధించిన అంశాలు కాక రేపనున్నాయి. మూసీ పునరుజ్జీవం అంశంతో పాటు హైడ్రా, మెట్రో విస్తరణ, ఇతర అభివృద్ధి పనులకు సంబంధించిన అంశాలను ప్రభుత్వం శాసనసభ సమావేశాల వేదికగా చర్చించే అవకాశం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకోవడంతో శాసనసభ సమావేశాల్లో ప్రభుత్వం కీలక అంశాలపై ప్రజలకు స్పష్టత ఇచ్చేందుకు ఉపయోగించుకోనుంది. మూసీ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న ప్రభుత్వం అసెంబ్లీ వేదికగా ప్రభుత్వ వైఖరిని ప్రకటించనుంది. హైదరాబాద్‌లో చెరువుల పునరుద్ధరణ, ఆక్రమణలకు అడ్డుకట్ట వేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన హైడ్రాకు చట్టబద్ధత కల్పిస్తూ ఇప్పటికే ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. జీహెచ్‌ఎంసీ చట్ట సవరణ చేసి హైడ్రా ఏర్పాటుకు సంబంధించిన ఆర్డినెన్స్ ను ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ నేపథ్యంలో హైడ్రా ఏర్పాటు కోసం ఆర్డినెన్స్ స్థానంలో చట్టం తీసుకు వచ్చేందుకు బిల్లును ప్రవేశ పెట్టనుంది. హైదరాబాద్లో మెట్రో విస్తరణ రెండో దశపై కూడా అసెంబ్లీ సమావేశాల్లో చర్చించనున్నారు. మరోవైపు మూసీ పునరుజ్జీవం మూసీలో ఆక్రమణల తొలగింపు, హైడ్రా ఏర్పాటు అంశాలపై నిలదీయాలని ప్రతిపక్షాలు భావిస్తున్నాయి. ఇప్పటికే మూసీ ప్రాంతాల్లో బీఆర్‌ఎస్, బీజేపీ నేతలు పర్యటించి వారికి సంఘీ భావం తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం నుంచి పలు అంశాలపై స్పష్టత కోరనున్నాయి.



**ప్రభుత్వాన్ని నిలదీయాలని కేసీఆర్ పిలుపు..**

సోమవారం నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలపై గొంతు విప్పాలని బీఆర్‌ఎస్ అధ్యక్షుడు కేసీఆర్ పార్టీ ఎమ్మెల్యేలకు సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడం చేతకాక ప్రభుత్వం కొనసాగిస్తున్న అణచివేత విధానాలను సభలో ఎండగట్టాలని చెప్పారు. ఎర్రవల్లి నివాసంలో జరిగిన బీఆర్‌ఎస్ శాసనసభా పక్షం సమావేశంలో పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు అసెంబ్లీ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై కేసీఆర్ దిశా నిర్దేశం చేశారు. సుమారు రెండున్నర గంటల పాటు ఈ భేటీ సాగింది. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను ఆగం చేయాలని కాంగ్రెస్ చూస్తోందని నమ్మి ఓట్లు వేసిన రైతులు, గిరిజనులు, దళితులను వేధిస్తోందని కేసీఆర్ అభిప్రాయపడ్డారు. ప్రజల పక్షాన ప్రశ్నిస్తున్న బీఆర్‌ఎ ఎస్ నేతలు, కార్యకర్తల మీద కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తోందని బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై బురద చల్లడానికి కాళేశ్వరం అంశాన్ని ముందుకు తెచ్చిందని ఉద్యోగులకు మొండి చేయి చూపుతూ కేవలం ఒకే ఒక్క డీఏను విడుదల చేశారని కేసీఆర్ విమర్శించారు. గురుకుల విద్యా సంస్థల్లో వైఫల్యాలను అసెంబ్లీలో ఎండగట్టాలఅని కేసీఆర్ పార్టీ ఎమ్మెల్యేలకు సూచించారు.



# పేదల సంక్షేమానికి పెద్దపీట

## ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి

## లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

**కలంజ్యోతి, గీసుకొండ :** ప్రజాప్రభుత్వంలో పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నట్లు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి తెలిపారు. మండలంలోని కొనాయిమాకుల రైతు వేదికలో 15, 16వ డివిజన్, మండలంలోని పలు గ్రామాల్లో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, సీఎంఆర్ ఎఫ్ సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే మంగళవారం పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడ్డాక పరకాల నియోజకవర్గం వ్యాప్తంగా ఇప్పటివరకు మొత్తం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ ద్వారా 1556 మందికి రూ.15,57,78,496లు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీసీసీ జనరల్ సెక్రెటరీ భీమగాని సౌజన్య, జిల్లా నాయకులు చాడ కొమరారెడ్డి, మండల నాయకులు తుమ్మనపల్లి శ్రీనివాస్, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ధర్మపురిలో బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

## ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణకుమార్

- స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన కలెక్టర్ సత్యప్రసాద్



**కలంజ్యోతి, జగిత్యాల :**

ధర్మపురి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలకు ప్రభుత్వం తరపున సకల ఏర్పాట్లు చేపట్టామని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణకుమార్ పేర్కొన్నారు. స్వామివారి కల్యణం సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ దంపతులు స్వామివారికి పట్టు వస్త్రాలు, తలంబ్రాలు సమర్పించారు. బ్రహ్మోత్సవాలకు హాజరయ్యే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. జగిత్యాల జిల్లాలోని ధర్మపురి మండలం కేంద్రంలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి కల్యాణ బ్రహ్మోత్సవాల మహోత్సవం సందర్భంగా మంగళవారం విప్ లక్ష్మణ్ కుమార్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో చేపట్టిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా విప్ మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. స్వామి వారి దర్శనం త్వరగా జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాహనాల పార్కింగ్ వద్ద పోలీసు అధికారులు వాహనదారులు ఇబ్బందులు పడకుండా చూడాలని పేర్కొన్నారు. మార్చి 10 నుంచి మార్చి 22 వరకు లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయని లక్ష్మణ్ కుమార్ పేర్కొన్నారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లానుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి కూడా భక్తులు పెద్దసంఖ్యలో వస్తుంటారని తెలిపారు. వారికి అన్ని రకాలుగా అధికారులు సహాయ సహకారాలు అందించాలని సూచించారు. అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన ఉచిత అన్నదాన సత్రాన్ని విప్ లక్ష్మణ్ కుమార్, జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పరిశీలించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టామన్నారు. కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, జగిత్యాల డీఎస్పీ రఘుచందర్, తహసీల్దార్ కృష్ణచైతన్య, ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్, తదితర సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

### తాగునీరు ఎద్దడి రాకుండా చూడాలి

### కలెక్టర్ సత్యప్రసాద్, ప్రభుత్వ విప్ లక్ష్మణ్

ధర్మపురి నియోజకవర్గంలో ఏర్పాటుచేసిన తాగునీరు, సాగునీరు ఎద్దడి రాకుండా ఏర్పాట్లు చూసుకోవాలని జిల్లా కలెక్టర్, ధర్మపురి ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులకు సూచించారు. మంగళవారం నీటిపారుదల శాఖ, మైనింగ్ మిషన్ భగీరథ ఎమ్మార్వోలు ఎంపీడీవోలు మున్సిపల్ కమిషనర్ అధికారులతో రివ్యూ మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి టెంపుల్ ఈవో సకటాల శ్రీనివాస్, రోడ్డు భవనాల శాఖ శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.





# యువకుడికి సన్మానం

**కలంజ్యోతి, ఇల్లంతకుంట :** మండలంలోని అనంతగిరి గ్రామానికి చెందిన గొట్టిపర్తి రాకేష్ (26) మంగళవారం విడుదలైన గ్రూప్2 ఫలితాలలో స్టేట్ 24వ ర్యాంక్ సాధించాడు. ఈ సందర్భంగా ఇల్లంతకుంట మండల అలయన్స్ క్లబ్ అధ్యక్షుడు అల్లాడి ఆనంద్ కుమార్ ఆధ్వర్యంలో రాకేష్ ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి కూనబోయిన బాలరాజు, పీఆర్ఓ బండారి నర్సయ్య, జాయింట్ పీఆర్వో పర్స ఐలయ్య, మీడియా ఇంచార్జ్ దయ్యాల సురేష్, అలయన్స్ క్లబ్ సభ్యులు కోహెడ భాస్కర్, కాసుపాక శంకర్, బొంగోని సత్యం, కీసరి కనుకయ్య, నార్ల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# తాళంవేసి ఉన్న ఇంట్లో చోరీ




**కలంజ్యోతి, మల్యాల :** మండల కేంద్రంలోని విద్యానగర్ కు చెందిన అస్మా సుల్తానా ఇంట్లో చోరీ జరిగింది. ఎస్ఐ నరేష్ కథనం మేరకు.. ఈ నెల 6న తన ఇంటికి తాళం వేసి, జగిత్యాలలోని కూతురి ఇంటికి కుటుంబ సభ్యులతో సహా వెళ్లింది. మంగళవరం వచ్చి చూసేసరికి తలుపుల తాళాలు పగులగొట్టి ఉండడంతో లోపలికి వెళ్ళి చూసేసరికి బీరువలో ఉన్న 5 తులాల బంగారు ఆభరణాలు, రూ.25 వేల నగదు దొంగలు ఎత్తుకెళ్లారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కాల్వ పూర్తయ్యేదెన్నడో?



నాలుగున్నర ఎకరాల్లో వరి సాగుచేసిన. సుమారు రూ.80 వేల వరకు పెట్టుబడి అయ్యింది. బోర్లలో ఒక్కసారిగా నీళ్లు అడుగుకుపోయినై. పొలమంతా పొట్ట, ఈత దశలో ఉంది. ఏం చెయ్యాలో అర్థం కాలేదు. రెండు రోజులకు రూ.15వేలతో ట్యాంకర్ తో వరి చేనుకు నీళ్లు పోస్తున్న. (ఫిబ్రవరి చివరి వారం నుంచి) నీళ్లు అడుగంటినై. రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. పంటలన్నీ ఎండిపోతున్నాయి. ఎల్లంపల్లి కాల్వ పనులు కోసం ఎదురు చూస్తున్నం. కాలువ పూర్తయితేనే పంటలకు సాగు నీరందుతది. ఇకనైనా సర్కారు స్పందించి సీఎం రేవంత్ రెడ్డి నష్టపోయిన రైతుల గురించి ఏం ఆలోచన చేస్తారో చూడలే.

- కంటే రెడ్డి. రైతు, రుద్రంగి



## సర్కారు పట్టించుకోవాలి



నాకున్న మూడు ఎకరాల పొలం ఉన్నది. గతేడాది మాదిరిగా నీరందుతుందని ఆశపడి ఎకరాకు రూ.35 వేల పెట్టుబడితో పొలం వేసిన. ఇప్పుడు నీళ్లందక పొలాలు ఎండుతున్నయి. మా పక్కనే ఎల్లంపల్లి కాల్వ ఉన్నది. కానీ, మాకు సాగు నీరు అందుతలేదు. ప్రభుత్వ పెద్దలు పట్టించుకోవాలి. మాకు శాశ్వత పరిష్కారం చూపాలి. నీళ్లు రాకపోతే పంటలు ఎండి పోతయి. పెట్టుబడులు ఎళ్లక మేం అప్పులపాలైతం.

- జలగం శ్రీనివాసరావు. రైతు, లింగంపేట



# ట్యాంకర్లతో పంట తడి

- మండల వ్యాప్తంగా ఎండిపోతున్న పంటలు ట్యాంకర్లతో నీరు తెచ్చిపోస్తున్న రైతులు
- పూర్తికానీ ఎల్లంపల్లి కాల్వ.. అందని సాగునీరు
- అడుగంటిన భూగర్భ జలాలు..
- ఎండిపోతున్న బోర్లు

**కలంజ్యోతి, చందుర్తి** : చందుర్తి మండలంలో రైతుల పరిస్థితి అగమ్య గోచరంగా మారుతోంది. ఒక వైపు భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి. వర్షాభావ పరిస్థితులతో ఈ ఏడాది వర్షాలు తక్కువవడంతో చెరువులు, కుంటల్లో నీరు అంతంతగానే చేరింది. భూగర్భజలాలు రోజురోజుకూ అడుగంటిపోవడంతో బోర్లు, బావులు వట్టిపోతున్నాయి. బోర్లు, బావుల కింద సాగుచేసిన పైరు ఎండి పోతోంది. దీంతో రైతన్న పంటలను రక్షించుకునేందుకు నానా ఇబ్బందులు పడుతున్నారు. కొంతమంది రైతులు ట్యాంకర్ల ద్వారా నీరందిస్తూ కాపాడుకునే ప్రయత్నం చేస్తున్నారు. మరి కొంతమంది రైతులు ఎండిన వరి పైరు పశువులకు మేతగా మారుతుండడంతో రైతు వేదన వర్ణణాతీతంగా మారుతోంది.

**ట్యాంకర్ల ద్వారా నీరు..**

పొట్ట దశలో ఉన్న పంట పొలాన్ని కాపాడుకోవడానికి మంగళవారం చందుర్తి మండలం లింగంపేట గ్రామానికి చెందిన రైతులు జలగం శ్రీనివాసరావు, మెరుగు నర్సయ్య, కంటే రెడ్డి విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. రెండురోజులకు ఒకసారి ట్యాంకర్ల ద్వారా నీటిని అందిస్తున్నారు. ఒక్కసారి నీటి తడికి రూ.20 వేలు ఖర్చు చేస్తున్నారు. రెండు రోజులకు 50 ట్యాంకర్ల నీటితో పంట పొలానికి నీరు పెడుతున్నట్టు రైతులు తెలిపారు.





## చల్లంగ చూడు..
# బద్దీ పోచమ్మ తల్లీ..

కలంజ్యోతి, వేములవాడ : దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామివారి ఆలయానికి అనుబంధ దేవాలయమైన బద్ది పోచమ్మ ఆలయానికి మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అమ్మవారికి ఇష్టమైన బోనాల నైవేద్యాలు, పసుపు, కుంకుమలు సమర్పించి సేవలో తరించారు. అందరినీ చల్లగా చూడు తల్లి అంటూ అమ్మవారిని వేడుకున్నారు. బోనాల నైవేద్యాలు సమర్పించెందుకు అధిక సంఖ్యలో భక్తులు రావడంతో ఇబ్బందులు లేకుండా అధికారులు పర్యవేక్షించారు.



# తులం బంగారం ఎక్కడా?

## బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి



**కలంజ్యోతి, నిర్మల్ :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి అమలుకు సాధ్యంకాని హామలు ఇచ్చిందని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మండిపడ్డారు. కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకంలో భాగంగా రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాకా ఇచ్చిన హామీని తుంగలో తొక్కిందని మండిపడ్డారు. నిర్మల్ జిల్లాలోని పలు మండలాల్లో బీజేఎల్పీ నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి శ్రీకారం చుట్టారు. సోన్ మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ సమగ్ర శిక్షాఅభియాన్ నిధులు రూ.4.15 కోట్లతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ) నూతన భవన నిర్మాణాన్ని ప్రారంభించారు. కేంద్ర ప్రభుత్వ ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.49.75 లక్షలతో నిర్మించనున్న కేజీబీవీ భవన ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మండల కేంద్రంలో ఇందిరమ్మ మోడల్ హౌస్ భవన నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు.

### కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ..

సోన్ మండలానికి చెందిన 59 మంది కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు ఏలేటి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలో పెళ్లైన ఆడబిడ్డలకు రూ.1లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక ఇచ్చిన హామీలను తుంగలో తొక్కారన్నారు. పొట్టపల్లిలో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమి పూజ, అనంతరం గ్రామంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, నాయకులు సత్యనారాయణగౌడ్, భూపాల్ రెడ్డి, మండల అధ్యక్షుడు చిన్నయ్య, మాజీ ఎంపీపీలు అద్వాల రమేష్, సరికెల గంగన్న, మాజీ సర్పంచ్ ముత్యం రెడ్డి, మాజీ ఎంపీటీసీలు ఒస రాజు, రాజేశ్వర్, నాయకులు శ్రీధర్ రెడ్డి, పోషెట్టీ, రాజు, అశోక్, తదితరులు పాల్గొన్నారు.





# సోషల్ మీడియాతో అప్రమత్తంగా ఉండాలి

## అడిషనల్ ఎస్పీ ఉపేంద్రారెడ్డి

**కలంజ్యోతి, నిర్మల్ :** విద్యార్థులు తమ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ముం దుకు సాగాలని నిర్మల్ అడిషనల్ ఎస్పీ ఉపేంద్రారెడ్డి సూచించారు. ప్రధానంగా సోషల్ మీడియా వంటి ఆకర్షణలకు దూరంగా ఉండాలని ఆయన ఉద్బోధించారు. స్థానిక జేవీఎన్ఆర్ ఉన్నత పాఠశాలలో మంగళవారం రాత్రి జరిగిన పాఠశాల వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. తల్లిదండ్రులు తమ పిల్లలపై ఎన్నో ఆశలతో ఉంటారన్నారు. వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా చదువుపై ధ్యాస పెట్టా లని అన్నారు. అలాగే విద్యార్థులు తమకు నచ్చిన సబ్జెక్టుపై దృష్టి సారించి, కోర్సులు ఎంపిక చేసుకోవాలని అన్నారు. తమ సామర్థ్యాన్ని అనుసరించి చదువుకుంటే ముందుకు సాగవచ్చని అన్నారు. ఎగ్జిబిషన్ సొసైటీ వంటి సంస్థలు స్వలాభాపేక్ష లేకుండా విద్యను అందించటం అభినందించదగిన విషయమన్నారు. విద్యార్థుల భవిష్యత్తును నిర్దేశించటంలో వారికి మార్గద ర్శనం చేసే బాధ్యత ఉపాధ్యాయులపై, తల్లిదండ్రులపై ఉందన్నారు. తల్లిదం డ్రులు ఎప్పటికప్పుడు తమ పిల్లలను నిశితంగా పరిశీలిస్తూ ఉండాలని కోరారు. అప్పుడే వారు ఆకర్షణలకు దూరంగా ఉంటారని సూచించారు. ఒకప్పుడు చదువుపై శ్రద్ధ కనబరచని వారు సైతం చదువుపై శ్రద్ధ చూపుతుండటం అభినందనీయమన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి శ్రద్ధ చూపితే మెరుగైన సమాజాన్ని రూపొందించవచ్చని అన్నారు. అపుడే నేర రహిత సమాజం రూపు దిద్దుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ పి శ్రీనివాస్, వైస్ చైర్మన్ మురళీమోహన్, కార్యదర్శి రూపేందర్ వాఘ్రే, జాయింట్ సెక్రటరీ వినయ్ కుమార్, కోశాధికారి చేతన్ ఆనంద్, జనరల్ బాడీ సభ్యులు చంద్ర శేఖర్, ఎస్పీ వేంకటేశ్వర రావు, గణపతి, సురేష్ కుమార్, నరేందర్ సింగ్, జి వెంకటరమణ, ఛార్లెస్ స్టడ్, నితిన్, వనం సురేందర్, ప్రిన్సిపాల్ మణి కుమారి తదితరులున్నారు.

# విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీకి చర్యలు

## మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

**కలంజ్యోతి, మంచిర్యాల :** ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులలో కంటి అద్దాలు అవసరమైన వారికి పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని రాజీవ్ నగర్ లోని కస్తూరిభా గాంధీ బాలికల విద్యాలయంలో 20 మంది విద్యార్థులకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్ రాజ్, వైద్య అధికారులతో కలిసి కంటి అద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 568 పాఠశాలలు ఉండగా ఇందులో 164 రెసిడెన్షియల్ పాఠశాలలలో 8 ఆర్.బీఎస్ కే బృందాల ద్వారా విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి 1, 274 మంది విద్యార్థులకు కంటి సమస్యలు ఉన్నట్లుగా గుర్తించినట్లు తెలిపారు. వీరందరికీ కంటి వైద్య నిపుణులు యశ్వంత్ రావు, చంద్రబాన్, శిల్పశ్రీ, అప్తాల్మిక్ అధికారులు శంకర్, భాస్కర్ రెడ్డిల ద్వారా ఫిబ్రవరి నెలలో ప్రభుత్వాసుపత్రిలో తిరిగి పరీక్షలు నిర్వహించి అద్దాల కోసం వివరాలు పంపించనున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలోని 1, 241 మంది విద్యార్థులకు కంటి అద్దాలు అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉప వైద్యాధికారి డాక్టర్ అనిత, జిల్లా అంధత్వ నివారణ అధికారి డాక్టర్ యశ్వంతరావు, వైద్యాధికారులు ప్రసాద్, కృపాబాయి, అశోక్, శ్వేత, మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్లు, పాఠశాల ప్రిన్సిపాల్ స్వప్న, ఉపాధ్యాయులు, వైద్యాధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

